



క్రైం కార్నర్

వరి కొయ్యలు కాలుస్తూ ఊపిరాడక రైతు మృతి


రాజయ్య (ఫైల్)

కోహెడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం తంగళ్లపల్లిలో వరికొయ్యలు కాలుస్తుండగా, ఊపిరి ఆడక ఓ రైతు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తంగళ్లపల్లికి చెందిన రైతు లెంకల రాజయ్య(57)కు ఎకరం 20 గుంటల భూమి ఉంది. ఖరీఫ్‌లో వరి సాగు చేశాడు. రబీ సీజన్ కోసం భూమిని సిద్ధం చేసేందుకు వరి కొయ్యలకు బుధవారం నిప్పు పెట్టాడు. పక్క రైతు పొలంలోకి మంటలు వ్యాపిస్తుండటంతో ఆందోళన చెంది.. దానిని ఆర్పేసే క్రమంలో పొగకు ఊరిరాడక అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. రాజయ్య భార్య మూడేళ్లు గా పక్షవాతంతో మంచంపై ఉంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ఓసీడీ వ్యాధి తట్టుకోలేకనే అంటూ సూసైడ్ నోట్
- ఐదు రోజుల క్రితమే కళాశాలలో చేరిక

సిద్దిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న ఏసీపీ మధు, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ బుధవారం కళాశాలను సందర్శించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని ఏడేళ్లుగా ఓసీడీ వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతోంది. ఆమెకు మెడికల్ సీటు రావడంతో సిద్దిపేట సమీపంలోని మెడికల్ కళాశాలలో ఐదు రోజుల క్రితమే చేరింది. అయితే, ఆమెకు ఇక్కడ చదవడం ఇష్టం లేదని.. తల్లిదండ్రుల వద్దకు ఎలాగైనా వెళ్లాలనే ఆలోచనతో శనివారం సూసైడ్ నోట్ రాసి, ఆదివారం కళాశాల భవనంపై నుంచి దూకింది. ప్రస్తుతం విద్యార్థిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని పోలీసులు తెలిపారు. అయితే, విద్యార్థిని గదిలో దొరికిన సూసైడ్ నోట్‌లో తాను కొంత కాలంగా ఓసీడీ వ్యాధితో బాధపడుతున్నానని, మందులు వాడినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నానని రాసి ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

గ్రంథాలయాలు నిశ్శబ్ద ఆలయాలు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి 8



నల్లవాగుపైనే ఆశలు
- యాసంగిలో 4 వేల ఎకరాలకు నీరందించడమే లక్ష్యం 7

మహిళలకు అండగా అభయ

సురక్షిత ప్రయాణానికి యాప్

- మహిళల, పిల్లల రక్షణకు మరొక అడుగు ముందుకు వేసిన పోలీసులు
- సిద్దిపేట ఆటోలకు 'అభయ యాప్' అనుసంధానం
- ప్రారంభించిన సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, వృద్ధులు, చిన్నారులపై అఘాయిత్యాలు రోజురోజుకూ అధికమవుతూనే ఉన్నాయి. వాటిని అరికట్టడానికి, అలాగే మహిళలకు రక్షణ కల్పించడానికి పోలీసులు నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూనే ఉన్నారు. అయినా కూడా ఒక్కోసారి ఏదో ఒకచోట హత్యలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మహిళలు, చిన్నపిల్లల సురక్షితమైన ప్రయాణం కోసం సిద్దిపేట పోలీసులు అభయ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికుల భద్రతకు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆటోరిక్షాల సర్వీసెస్ వాహన యాజమాన్యం నుంచి అవసరమైన డాక్యుమెంట్లు, సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసిన తర్వాత క్రోడీకరించిన సమాచారాన్ని అభయ 'మై టాక్సీ సేఫ్' యాప్ క్యూఆర్ కోడ్ రూపంలో తీసుకొచ్చారు.



సిద్దిపేటలో అభయ యాప్‌ను ప్రారంభిస్తున్న సీపీ అనురాధ

యాప్‌ను ప్రారంభించిన సీపీ

అభయ యాప్‌ను సిద్దిపేట సీపీ అనురాధ కమిషనర్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రారంభించారు. అనంతరం సిద్దిపేట పట్టణ ఆటోడ్రైవర్లకు అభయ క్యూఆర్ కోడ్, పేపర్లను అందజేశారు. ఇప్పటివరకు 1250 ఆటో అభయ యాప్ స్టిక్కరింగ్ పూర్తి చేశారు. జిల్లాలోని మిగతా ఆటోలకు కూడా త్వరగా స్టిక్కరింగ్ చేయాలని అధికారులకు సూచించారు.

ప్రయాణికుల రక్షణకు..

మహిళా ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో అభద్రతగా భావిస్తే వెంటనే తమ వద్దనున్న సెల్‌ఫోన్‌లో ఏదైనా స్కానర్ నుంచి (ఫోన్‌పే, గూగుల్‌పే, గూగుల్ స్కానర్) ఆటోలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. వెంటనే డ్రైవర్ ఫొటో, అతని, వాహనం వివరాలు వస్తాయి. వెంటనే స్కాన్ చేసిన ఫోన్ నుంచి తమ ఫోన్ నంబర్ ఎంటర్ చేసి ట్రేస్ ద లొకేషన్ అని ఎంట్రీ చేయగానే ఎమర్జెన్సీ కాల్, ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ వస్తాయి. ఎమర్జెన్సీ కాల్, టెక్ట్స్ రూపంలో స్పందించినపుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న వాహనం లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్తుంది. ఆటోలో ఎక్కినప్పటి నుంచి దిగే వరకు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా మానిటర్ చేస్తారు. సమీపంలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని

మిగతా 8వ పేజీలో...

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పూర్తవ్వాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పూర్తవ్వాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అవకాశాలు చాలా ఉన్నాయని రైతులను ఒప్పించి ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, హార్టికల్చర్, ఆయిల్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనేక అనుకూల అంశాలున్నాయన్నారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఎప్పటికీ అధిక ఆదాయం పొందడమే కాకుండా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం వేగంగా జరుగుతున్నందున రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా సులభమవుతుందన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ పామ్ పంటలు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పా రు. వ్యవసాయ క్లస్టర్ల వారీగా ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటించాలని లక్ష్యం చేరడంలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారులు నిరం తరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వరిధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే దొడ్డు, సన్న ధాన్యాన్ని గుర్తించడంలో కేంద్రంలో నిర్వాహకులకు సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్, మార్క్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

దుబ్బాకలో వైద్యసేవలు భేష్

- రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

దుబ్బాక, నవంబరు 20 : దుబ్బాక ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు భేష్‌గా ఉన్నాయని, మారుమూల ప్రాంతంలో కూడా ఇంతటి వైద్యసేవలు అం దించడం హర్షనీయమని వైద్యవిధానపరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ, ఐపీ, ఆరోగ్యశ్రీ సేవలను పరిశీలించారు. ఓపీ సేవలు మరింత పెరగాలని సూచించారు. ప్రసవాల సంఖ్య మెరుగ్గా ఉందని, ఆపరేషన్‌ల సంఖ్య కూడా ఎక్కువగానే ఉందన్నారు. మూడుజిల్లాల సరిహద్దు ప్రాంతం కావడంతో మూడుజిల్లాల ప్రజలు వైద్యసేవలకు దుబ్బాకకు రావడం అభినందించదగినదన్నారు. అరుదైన ఆపరేషన్లతో రోగుల్లో దుబ్బాక ఆసుపత్రిపై నమ్మకం కలుగుతుందని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వైద్యసేవలు పొందుతున్నారన్నారు. శానిటేషన్, రోగులకు అందించే భోజనం మరింత మెరుగవ్వాలన్నారు.


దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

కల్యాణంలోగా స్వర్ణకిరీటాలు అందేనా

- గతేడాది మంత్రి కొండా సురేఖ ప్రకటన
- ఇప్పటికీ కానరాని చర్యలు
- సమీపిస్తున్న మల్లన్న జాతర



చేర్యాల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): స్వర్ణమకుటధారుడిగా దర్శనమిస్తున్న కొమురవెల్లి మల్లన్న మాదిరిగానే స్వామివారి చెంతనున్న మేడలమ్మ, కేతలమ్మకు బంగారు కిరీటాలు చేయిస్తామని గతేడాది స్వామివారి క ల్యాణం రోజున దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. ఈ క్రమంలో డిసెంబరు 29న స్వామివారి కల్యాణం జరగనుంది. ఇప్పటివరకు దేవాదాయ అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో బంగారు కిరీటాలు సమకూరుస్తారా? లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది.

మల్లన్న కిరీటానికి రూ.4కోట్ల విలువైన బంగారం

తమ కోర్కెలు ఈడేర్చినందుకు భక్తులు కానుకగా బం గారం, వెండి మొక్కుబడులు హుండీల్లో సమర్పిస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీమంత్రి హరీశ్‌రావు చొరవతో బంగారాన్ని కరిగించి సుమారు రూ.4కోట్ల వ్యయంతో 6.50 కిలోల పరిమాణంతో స్వర్ణమకుటాన్ని తయారు చేయించారు. ఇదేక్రమంలో అమ్మవార్లకూ బంగారు కిరీటాలు చేయిస్తామని ప్రకటించారు. కానీ గతేడాది మల్లన్న కల్యాణం నాటికి అధికారం కోల్పోవడంతో పాటు దేవాదాయశాఖాధికారుల నిర్లక్ష్యంతో అమలుకు నోచుకోలేదు. ఈవిషయమై అమ్మవార్లపై చిన్నచూపు వహించడం తగదంటూ భక్తులు మండిపడుతున్న విషయమై 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించింది. దేవాదాయశాఖాధికారులు తేరుకుని అమ్మవార్ల విగ్రహాలు, కిరీటం నెలకొల్పే పరిమాణం కొలతలు ఇతరత్రా చర్యలు తీసుకున్నప్పటికీ గర్భాలయ రక్షణతో పాటు ఇతరత్రా చర్యల విషయమై తమకెందుకు భారమని చేతులెత్తేసి అటకెక్కించారు.

అమ్మవార్లకు పుస్తెలతాడు, పూలమాలలే దిక్కు

మల్లన్నకు ఇరువైపులా మేడలాదేవి, కేతలమ్మ కొలువై ఉన్నా రు. దేవతామూర్తుల విగ్రహాలను శతాబ్దాల క్రితం పుట్టమన్నుతో రూపొందించినప్పటికీ ఆభరణాలేవీ అలంకరించలేదు. కేవలం బంగారు పుస్తెలు మాత్రమే ఉన్నాయి. నిత్యం పూలమాలలు మాత్రమే అలంకరిస్తున్నారు. స్వామివారికి కిరీటం తయారీ చేయగా ఇరువురు అమ్మవార్లకూ కిరీటంతో పాటు మల్లన్నకు బంగారు కోరమీసం తయారీకి అవసరమయ్యే బంగారం అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంతో భక్తులు నిరాశకు లోనవుతున్నారు.

ఇటీవల మంత్రి ప్రకటించినా..

మల్లన్నను ఇలవేల్పుగా కొలుస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కుటుంబ ఆనవాయితీగా యేటా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. గతేడాది స్వామివారి కల్యాణానికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అప్పుడే ఏర్పడిన ప్రభుత్వం కావడంతో ఆలయాభివృద్ధిపై ఎలాంటి నిధులు ప్రకటించకపోగా, రెండేళ్లక్రితం మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రకటన మాదిరిగానే అమ్మవార్లకు బంగారు కిరీటాలు ఏర్పాటుచేయిస్తామని ప్రకటించారు. కానీ ఎలాంటి ప్రక్రియ చేపట్టకపోవడంతో ఇటీవల తన మనువడి పుట్టువెంట్రుకలు తీయడానికి ఆలయానికి వచ్చిన మంత్రి కొండా సురేఖ అమ్మవార్ల కిరీట ఏర్పాటుపైనా ప్రకటించారు. కల్యాణానికి సంసిద్ధం చేస్తామని పేర్కొన్నారు. గతంలో మల్లన్న కిరీటానికే ఏడాదిన్నర సమయం పట్టింది. కానీ అమ్మవార్ల కిరీటా ల తయారీకి సంబంధించిన ప్రక్రియ చేపట్టకపోవడం, స్వామివారి కల్యాణానికి నెలరోజులే ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది స్వామివారి కల్యాణం రోజున దేవాదాయశాఖ భక్తులకు ఎలాంటి అనుభూతి కల్పించనున్నారన్న విషయం ఆసక్తికరంగా మారింది.


కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవంలో భాగంగా బుధవారం పవమానసూక్త, ఔషధీ సూక్త పారాయణం చేశారు. ఆలయ ముఖమండపంలో త్రిశూలం, ఢమరుకం, ఓంకారం ఆకారంలో దీపాలను వెలిగించారు.

వణికిస్తున్న చలి

- కోహీర్ మండలంలో 9 డిగ్రీలు
- మరింత పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రత
- ఐదేళ్లుగా అత్యల్పంగా నమోదు
- న్యాల్‌కల్ మండలంలోనూ కనిష్ఠం
- ఉమ్మడి జిల్లా గజగజ

కోహీర్/మెదక్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా గజగజ వణికిపోతున్నది. జిల్లా అంతటా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో శీతల గాలులతో పాటు చలి తీవ్రత పెరిగింది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంపై అత్యధికంగా ప్రభావం కనపడుతున్నది. కోహీర్, జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లో ప్రతి సంవత్సరం రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఐదేళ్లుగా కోహీర్ మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయికి పడిపోతున్నాయి. ఇక్కడ మూడు రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కాగా సోమవారం రాత్రి వరకు సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. మొన్న 9.5 డిగ్రీలు నమోదవగా, మంగళవారం రాత్రి 9.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో నమోదైన ఉష్ణోగ్రతలలో ఇదే తక్కువ.

చలి తీవ్రతకు కారణాలు

జహీరాబాద్ ప్రాంతానికి సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక, మహారాష్ట్రల పరిధిలో అటవీ భూములు అత్యధికంగా ఉండడంతోనే యేటా చలికాలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ జహీరాబాద్, మొగుడంపల్లి, నాల్కల్ మండలాలకు సరిహద్దుల్లో కర్ణాటక రాష్ట్రం ఉన్నది. ఈ ప్రాంతంలో పడమర వైపున అత్యధికంగా అడవులు ఉండడం, తక్కువ ఎత్తు నుంచి ఈదురుగాలు వచ్చే క్రమంలో చలిగాలులు మరింత పెరిగి అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు అవుతున్నాయని నిపుణులు పేర్కొన్నారు. అంతే కాకుండా నల్లరేగడి భూములు ఉండడం కూడా ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ భూముల్లో అత్యధికంగా తేమ శాతం ఉండడం వల్ల ఈదురుగాలులు వచ్చే క్రమంలో భూమిలోని తేమశాతం అధికమై చల్లని గాలులకు కారణమవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. మరో రెండు రోజులు సంగారెడ్డి జిల్లాలో మరింత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పెరిగిన చలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. మొన్నటి వరకు చలి తక్కువగా ఉన్నది. వారం రోజుల క్రితం వరకు 17 డిగ్రీలున్న ఉష్ణోగ్రతలు కార్తీక పౌర్ణమి నుంచి క్రమంగా పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంలోనూ రాత్రి ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంలోనూ రాత్రి ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. కిందటి రోజు 11.1 డిగ్రీలు ఉండగా మంగళవారం రాత్రి మాత్రం 9.9 డిగ్రీలకు పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11 డిగ్రీలు వరకు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్‌లో 11.1 డిగ్రీలు, మెదక్ జిల్లా శివ్వంపేటలో 11.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో సాయంత్రం నుంచే శీతలగాలులు తాకుతున్నాయి. వేకువజామున పొగమంచు కమ్మేస్తున్నది. తెల్లవారుజామున చలి తీవ్రంగా ఉండడంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జిల్లాలో.. కోహీర్ 9.0 డిగ్రీలు, న్యాల్‌కల్ మండలంలో 9.9, జహీరాబాద్‌లో 10.6 కంగ్టిలో 10.7, సత్వార్‌లో 10.7, అందోల్‌లో 11.1, గుమ్మడిదలలో 11.2, మునిపల్లిలో 11.4, మొగుడంపల్లిలో 12.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో.. శివ్వంపేటలో 11.6 డిగ్రీలు, కౌడిపల్లిలో 11.6, టేక్మాల్‌లో 12.3, హవేళీఘనపూర్‌లో 12.3, చిలప్‌చెడ్‌లో 12.3, నార్సింగ్‌లో 12.4 డిగ్రీలు

సిద్దిపేట జిల్లాలో.. మర్కుక్‌లో 11.1 డిగ్రీలు, కొండపాకలో 11.5, పోతిరెడ్డిపేట 11.6, నంగనూరులో 12.1, జగదేవ్‌పూర్‌లో 12.1 డిగ్రీలు



అనంత పద్మనాభ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు

● ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ

పుల్‌కల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలోని అత్యంత పురాతనమైన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటైంది. ఈ మేరకు దేవాదాయ శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా భానూరి లక్ష్మయ్య, మన్నె నర్సింహులు, జంగిలి మల్లమ్మ, తిమ్మారెడ్డిగారి అంజిరెడ్డి, రోళ్లపాటి సత్యనారాయణలతో పాటుగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకుడు మహరాజుల రామకృష్ణ శర్మలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పదవులకు వీరందరిచే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం ఆ ఐదుగురి సభ్యుల్లో నుంచి ఒకరిని బోర్డు చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఈ నెల 23వ తేదీ (శనివారం) పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రస్ట్ బోర్డు నూతన సభ్యులు బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. బోర్డు డైరెక్టర్లుగా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి తదితరులున్నారు.

విద్యార్థుల ఇంటికి అధ్యాపకులు

● హాజరుశాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమం



విద్యార్థులను కళాశాలకు పంపించాలని తల్లిని కోరుతున్న అధ్యాపకులు

వెల్దుర్తి, నవంబరు20(ఆంధ్రజ్యోతి) : కళాశాలకు రాని విద్యార్థుల ఇంటికి శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వెళ్లి కళాశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పులింగపూర్, రామాయిపల్లి, బండపోసన్‌పల్లి, ఎదులపల్లి గ్రామాలలో అధ్యాపకులు విద్యార్థుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 92 మంది విద్యార్థులు ఉండగా 55 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 106 మంది విద్యార్థులు ఉండగా 60 మంది విద్యార్థులు మాత్రమే కళాశాలకు హాజరవుతున్నారని వారు తెలిపారు. ఈ నెల 25వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫీజును ప్రతి విద్యార్థి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, నర్సింహులు, మధన్‌మోహన్, శ్యామ్, మహేష్, స్వామి, నాందేవ్ తదితరులు ఉన్నారు.





















నల్లవాగుపైనే ఆశలు

- యాసంగిలో 4 వేల ఎకరాలకు నీరందించడమే లక్ష్యం
- ప్రాజెక్టులో నీరు పుష్కలం.. త్వరలో ఆయకట్టు నిర్ధారణ


పూర్తి స్థాయి నీటి మట్టంతో నిండుకుండలా నల్లవాగు ప్రాజెక్టు

కల్హేర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్‌జిల్లాలో ఎంతో ప్రాముఖ్యం కలిగి ఏకైక మధ్యతరహా ప్రాజెక్టుగా వెలుగొందుచున్న సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు సాగు నీటిపైనే ఆయకట్టు రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. వానకాలంలో ఆలస్యంగా ఈ ప్రాజెక్టులోకి వరద చేరుకున్నది. దీంతో ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ, అత్యవసర కాలువల కింద రైతులు తమ భూముల్లో వరి నాట్లు వేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఆలస్యంగానైనా ప్రాజెక్టు నిండిపోవడం, నేటి వరకు రికార్డు స్థాయిలో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1493 అడుగుల కాగా నీటి నిల్వ కూడా అంతే ఉండటంతో ఆయకట్టు రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వానకాలంలో కోల్పోయిన పంటను యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకుని ప్రయోజనం పొందవచ్చునని భావిస్తున్నారు. దీనికి తోడు ఆయకట్టు పరిధిలో 4 మేల ఎకరాలకు సాగు నీరు అందజేసేలా కలెక్టర్ ఆధ్వర్యంలో టైబంధీ రూపొందిస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి కూడా రైతులకు ఇటీవల ప్రాజెక్టు వద్ద హామీ ఇవ్వడంతో యాసంగిపై గంపెడాశతో ఉన్నారు. నల్లవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1493(మిలియన్ క్యూబిక్ ఫీట్స్) అడుగుల కాగా ప్రస్తుతం 1493 అడుగుల నీటి సామర్థ్యం కలిగి 0.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పరిధిలో కుడి, ఎడమ కాలువల కింద 5100 ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. కుడి కాలువ కింద సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, కల్హేర్ మండలంలోని బీబీపేట, ఫత్తేపూర్, మార్డి, ఖానాపూర్(కె), కిష్టాపూర్, ఇందిరానగర్, కల్హేర్ గ్రామాలకు చెందిన ఆయకట్టు భూములు ఉన్నాయి. ఎడమ కాలువ కింద సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్, బొక్కస్‌గామ్, అంతర్గాం, కామారెడ్డి జిల్లా పిట్లం మండల పరిధిలోని మార్దండ, తిమ్మానగర్ గ్రామాలకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. అత్యవసర కాలువ కింద 60 ఎకరాలు సుల్తానాబాద్(నల్లవాగు) గ్రామానికి చెందిన రైతుల భూములు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఈ అత్యవసర కాలువ కింద 60 ఎకరాల భూములకు వరి పంటకే నీరు అందజేయాల్సి ఉంటుంది. మిగతా నిర్దేశిత ఆయకట్టుకు ఆరుతడి పంటల కోసం సాగునీరును అందజేస్తారు. మూడునాలుగు రోజుల్లో కలెక్టర్ అధ్యక్షతన ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖ అధికారుల సమక్షంలో ప్రాజెక్టు టైబంధీ(ఆయకట్టు నిర్ధారణ) చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

త్వరలోనే టైబంధీతో ఆయకట్టు నిర్ధారణ



జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తాను, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు సమావేశమై త్వరలోనే నల్లవాగు ప్రాజెక్టు యాసంగి ఆయకట్టు నిర్ధారణ చేస్తాం. వానకాలంలో ప్రాజెక్టు ఆలస్యంగా నిండటం మూలంగా రైతులు నష్టపోయారని, యాసంగిలో అధిక శాతం రైతులకు ప్రయోజనం కలిగేలా సాగు నీరు అందించాలనే యోచనలో ఉన్నాం. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి యాసంగిలో అధికశాతం ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తా

-సంజీవరెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..



నల్లవాగు ప్రాజెక్టు కింది ఆయకట్టు భూములకు యాసంగిలో ఆరుతడి పంటలకు సాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇదివరకే ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచనతో కలెక్టర్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు టైబంధీకి సంబంధించిన వివరాలు అందజేశాం. ప్రస్తుత నీటి నిల్వ ఆధారంగా 4 వేల ఎకరాలకు సాగునీరు అందించే యోచనలో నీటిపారుదల శాఖ ఉంది. త్వరలో నిర్వహించే ఐడీబీ సమావేశంలో ఆయకట్టు నిర్ధారణ కానుంది.

-పవన్‌కుమార్ డీఈ, నీటిపారుదల శాఖ


పోటీలకు హాజరైన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు

నాసా ప్రాంతీయ కన్వెన్షన్‌లో గీతం విద్యార్థిని ప్రతిభ

- 'రైటింగ్ ఆర్కిటెక్చర్' పోటీలో ప్రత్యేక అవార్డు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 20 : నాసా 67వ ప్రాంతీయ కన్వెన్షన్‌లో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ రెండో ఏడాది విద్యార్థిని రేష్మిక రైటింగ్ ఆర్కిటెక్చర్ పోటీలో సత్తా చాటినట్లు ఇన్‌చార్జి డైరెక్టర్ బందన్ కుమార్ మిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ప్రత్యేక ప్రస్తావన అవార్డును అందుకుని, ఓ ప్రతిష్ఠాత్మక వేదికలో తన సత్తా చాటినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అరోరాస్ డిజైన్ అకాడమీలో ఇటీవల జరిగిన 67వ నాసా ప్రాంతీయ కన్వెన్షన్‌లో దాదాపు 25 మంది మొదటి, రెండో ఏడాది గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. వర్క్ షాపులు, పోటీలకు అతీతంగా, ఈ కార్యక్రమం వివిధ సంస్థల సహచరుల మధ్య అర్థవంతమైన పరస్పర చర్యలను పెంపొందించిందని, తరువాతి తరం వాస్తుశిల్పులలో స్నేహభావాన్ని, సహకార అభ్యాసాన్ని ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థులను అధ్యాపకురాలు శ్రుతి గావాలి సమన్వయం చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- డీఎస్పీ రవీందర్‌రెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు రూరల్, నవంబరు 20 : విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణతో వాటి సాధించి సమాజానికి మంచి పేరు తేవాలని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ముత్తంగి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాలలో జిల్లాస్థాయి అండర్ 19 అండర్ 14 క్రీడా పోటీల ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అమూల్యమైందని ఈ దశలో సోషల్ మీడియా, ఫోన్ వంటి వ్యసనాలకు ప్రభావితం కాకుండా ఉన్నత శిఖరాలని అధిరోహించాలని కోరారు. ఈ పోటీలలో అండర్ 19, అండర్ 14 క్రీడలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జగదేవ్ పూర్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. వ్యక్తిగత పోటీలలో పూజ (జగదేవపూర్) ఛాంపియన్‌గా నిలిచింది. అండర్ 14 వ్యక్తిగత పోటీలలో వి. వైశాలి నరసాపూర్ ఛాంపియన్‌గా నిలిచింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.నవనీత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెట్టుకు ఆటో ఢీకొని వ్యక్తి మృతి


చంద్రకాంత్ మృతదేహం

రాయపోల్/గజ్వేల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన బిల్లివాల చంద్రకాంత్(36) ఈ నెల 19న రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలోని తన చెల్లి ఇంటికి వెళ్లి సాయంత్రం తన ఆటోలో తిరిగి నిజామాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్రాలసోఫా వద్ద ప్రమాదశాత్తు ఆటో చెట్టుకు ఢీకొంది. దీన్ని గమనించి స్థానికులు వారి బంధువులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు అతడిని గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ చెరువులో పడి డ్రైవర్..


చెరువులో పడిన ట్రాక్టర్, రమేష్ మృతదేహం (ఇన్‌సెట్లో)

నర్సాపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో పడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో తాత్కాలిక డ్రైవర్ రమేష్(26) చెత్తను తీసుకుని డంప్‌యార్డు వద్ద వేశాడు. అనంతరం తిరిగి చెరువు కట్టపై నుంచి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో పడిడడంతో రమేశ్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వివాహానికి నిరాకరించిన తండ్రి యువకుడి ఆత్మహత్య

కుకునూరుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తండ్రి ప్రేమ వివాహాన్ని నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కుకునూరుపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్‌కి చెందిన మహానంద సర్దార్(24) కుకునూరుపల్లి శివారులో ఓ ప్రైవేటు రెడిమిక్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం సర్దార్ తన స్వగ్రామమైన ముండాయనగర్‌కి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీనికి తండ్రి నిరాకరించడంతో మనస్తాపం చెందిన సర్దార్ మంగళవారం అర్ధరాత్రి తను పనిచేస్తున్న రెడిమిక్స్ కంపెనీ వెనకాల గల విద్యుత్ స్తంభానికి బెల్టుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

రామచంద్రాపురం, నవంబరు 20 : బాలిక అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీసు స్టేషన్ పరిధిలోని జ్యోతిరావు పూలే కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నేపాల్ దేశానికి చెందిన ఓ కుటుంబం పొట్టకూటి కోసం మనదేశ రాజధాని ఢిల్లీకి వచ్చారు. అక్కడ ఓ యువకుడితో జరిగిన ఘర్షణల కారణంగా ఢిల్లీ విడిచిపెట్టి బతుకుదెరువు కోసం తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ జ్యోతిరావు పూలే కాలనీకి వచ్చారు. తమ ఒక్కగానొక్క కూతురు(17)తో భార్యభర్తలు కూలీ చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే భార్యాభర్తలిద్దరు బుధవారం ఉదయం కూలీకి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. ఇరుగుపొరుగు వారిని విచారించినా కూతురు ఆచూకీ తెలియలేదు. ఆందోళన చెందిన దంపతులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు.

ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా రజిత

జోగిపేట, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా కొమ్ము రజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న కొమ్ము రజిత మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం.. కళాశాల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, గోవర్ధన్‌రెడ్డి, నూనె శ్రీనివాస్, శ్రావణ్, జక్కుల మల్లేశం, జీల మల్లేశం, రాజ్ కుమార్, అనిత. శశికళ, ప్రసన్న, రషీద్ గౌస్, నర్సింహులు, బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.


రజితను సన్మానిస్తున్న జోగిపేట కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

బస్సులు రాని బస్టాండ్

వెల్దుర్తి, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలో ప్రయాణికుల సౌకర్యార్థం సుమారు 17 ఏళ్ల క్రితం బస్టాండ్ నిర్మించారు. భవనం కట్టి వదిలేసిన అధికారులు మరుగుదొడ్లు, మూత్రశాలలు , నీటిసౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా బస్సులు రాలేదంటే అతిశయోక్తి కాదు. కంట్రోలర్ కోసం ఏర్పాటు చేసిన రెండు గదులకు తాళం తీసిన నాధుడే లేకుండా పోయారు. దీంతో బస్టాండ్ బిక్షాటన చేసే వారికి, మందుబాబులకు అడ్డాగా మారింది. ఇంకా కొందరు ధాన్యం ఆరబోసుకుంటున్నారు.



ఎవరికోసం కట్టారో..!

- రూ. లక్షల ఖర్చు వృథా
- వినియోగంలోకి రాని భవనాలు
- హత్నూరలో ఐబీ అతిథిగృహం
- నర్సాపూర్‌లో సాముహిక మరుగుదొడ్లు
- వెల్దుర్తిలో బస్టాండ్ కట్టి 17 ఏళ్లు

అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపు లేని కారణంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల పనులు పూర్తి అయినా.. మరి కొన్ని చోట్ల కొద్ది పాటి నిధులు వెచ్చిస్తే వినియోగించే అవకాశం ఉన్నా.. వాటిని గాలికి వదిలేశారు. దీంతో ప్రజాధనం నీటిలో పోసినట్లు అవుతున్నది. రూ. లక్షలు వెచ్చించి కట్టిన ఈ భవనాలను ఎందుకు కట్టారో.. ఎవరి కోసం కట్టారో అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. కేవలం కాంట్రాక్టర్లు, వారు ఇచ్చే కమీషన్ల కోసం కట్టి.. అలా వదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


హత్నూరలో నిరుపయోగంగా ఉన్న ఐబీ అతిథి గృహం

హత్నూరలో 'అతిథి' గృహమే..

హత్నూర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో హత్నూర మండల కేంద్రంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.27 లక్షల వ్యయంతో ఐబీ అధితి గృహం మంజూరు చేయించగా, భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. 2014 ఫిబ్రవరి 13న ఎమ్మెల్యే ఐబీ అతిథిగృహాన్ని ప్రారంభించారు. అయితే, అందులో ఫర్నిచర్, నీటి సదుపాయం కల్పించకపోవడంతో ఆ భవనం వినియోగించుకోలేని పరిస్థితి. దీంతో ప్రారంభించిన వారం రోజులకే తాళం పడింది. వినియోగంలో లేకపోవడంతో ఇప్పుడా భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. తలుపులు కిటికీలు తుప్పుపట్టి పోతున్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



అవసరమైన ఫర్నిచర్ లేకపోవడం వల్లే ఐబీ అతిధి గృహాన్ని ఎవరూ వినియోగించడంలేదు. ఫర్నిచర్‌కు అవసరమైన అదనపు నిధుల మంజూరు కోసం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులతోపాటు ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసి అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం.

- భూపుత్ర, ఐబీ ఏఈ

కట్టి మూడేళ్లు.. ప్రారంభించడానికి ఎన్నేళ్లో..


నర్సాపూర్‌లో మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్డి

నర్సాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత ప్రాంతంగా కేంద్రం ప్రకటించింది. పట్టణంలో ఎక్కడా బహిరంగ మల, మూత్ర విసర్జన లేకుండా చర్యలు తీసుకున్నామని, బహిరంగ మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించామని అధికారులు రికార్డుల్లో, ప్రభుత్వానికి ఇచ్చే నివేదికల్లో ఘంటాపథంగా చెప్పుకున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది అనడానికి పట్టణంలోని మూడు కూడళ్లలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లే నిదర్శనం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రూ. 45 లక్షలు వెచ్చించి.. వీటిని నిర్మించి మూడేళ్ల దాటుతున్నా.. వినియోగంలోకి తీసుకురాలేదు. పట్టణంలోని ఆసుపత్రి వద్ద, బస్టాండులో, తూప్రాన్ మార్గంలో ఒక్కొక్కటి రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ సామూహిక మరుగుదొడ్లు అలంకార ప్రాయంగా మారాయి. అయితే, జనం నుంచి విమర్శలు రావడంతో ఆస్పత్రి వద్ద ఉన్న సామూహిక మరుగుదొడ్డిని ప్రారంభించినా.. నిర్వహణ పట్టించుకోకపోవడంతో అది ఎప్పుడు తెరిచి ఉంటుందో.. ఎప్పుడు మూసి ఉంటుందో తెలియని పరిస్థితి. ఇక మిగిలిన చోట్ల కట్టి వదిలేయడంతో జనం వాటిని చూసి ఇవి ఎందుకు కట్టారో కట్టిన వారికే తెలియాలి అని అంటున్నారు.

నాచగిరి క్షేత్రంలో కార్తీక దీపోత్సవం

- భారీగా తరలివచ్చిన మహిళలు
- ప్రారంభమైన కొండపోచమ్మ ఆలయ 23వ వార్షికోత్సవాలు



వర్గల్: నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వర్గల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవం బుధవారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ అన్నపూర్ణ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు, సిబ్బంది కలిసి ఆలయ మండపంలో కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ మండపంలో ఆలయ వేద పండితులు లక్ష్మీనృసింహస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు, ఆలయ అర్చకుల నేతృత్వంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు.



జగదేవ్‌పూర్: కొండపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న సిబ్బంది

కొండపోచమ్మ వార్షికోత్సవ వేడుకలు

జగదేవ్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ నర్సాపూర్ కొండపోచమ్మ అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఆలయ నిర్వాహకులు ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాలు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రజిత రమేష్, ఆలయ సిబ్బంది కనకయ్య, హరిబాబు, కంచర్ల స్వామి, యాదగిరి ఉన్నారు.

నేడు జక్కాపూర్‌కు కేంద్ర మంత్రి

సిద్దిపేట రూరల్,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌కు నేడు కేంద్ర మంత్రి రామదాస్ అథవాలే రానున్నట్లు ఆర్‌పీఐ(రీపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా) ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కోంపెల్లి సాగర్ తండ్రి ఆర్‌పీఐ జాతీయ సమన్వయకర్త, రాష్ట్ర ఇన్‌చార్జి కోంపెల్లి ప్రభుదాస్‌ను ఆయన పరామర్శించనున్నట్లు వారు తెలిపారు. కేంద్ర మంత్రి రాక సందర్భంగా ఆర్‌పీఐ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ఎండీ షఫీ



మద్దూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఎం మద్దూరు మండల కార్యదర్శిగా సలాఖ్‌పూర్‌కు చెందిన ఎండీ షఫీ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి నూతన కమిటీని బుధవారం ప్రకటించారు. మండల కమిటీ సభ్యులుగా సుంకోజు ప్రశాంత్, నారదాసు కనకయ్య, కొండూరి ఎల్లస్వామి, బేజాడి మల్లారెడ్డి, అల్ల రమేష్, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, చెట్టిపల్లి సత్తిరెడ్డి, రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, కొంగరి వెంకట్‌మావో, చొప్పరి రవికుమార్, తాడూరి రవీందర్, బండకింది అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చేర్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి ప్రభుత్వస్థలం కేటాయించాలని కోరుతూ సీపీఐ డివిజన్ నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి తహసీల్దారు సమీర్ అహ్మద్‌ఖాన్‌కు బుధవారం వినతిపత్రం అందించారు.

రెవెన్యూ డివిజన్ పట్ల ఎమ్మెల్యే పల్లా వైఖరి సరికాదు

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి

చేర్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ పట్ల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వైఖరి సరికాదని కాంగ్రెస్ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ కోసం చేర్యాల ప్రాంత ప్రజలు పోరాడుతుండగా, కనీసం మాట మాత్రం కూడా ప్రకటించని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం మొసలి కన్నీరుకార్చుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాటుపడుతుండటాన్ని చూసి ఓర్వలేకే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసత్య ప్రకటనలు చేస్తుండటం తగదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం వైషమ్యాలు వీడి కొమ్మూరితో కలిసి పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పుర్మ ఆగంరెడ్డి, మంజ మల్లేశం, మేరుగు కృష్ణ, మంచాల చిరంజీవులు, దాసరి శ్రీకాంత్, మస్యాల యాదగిరి, చెవిటి లింగం, కర్క సంతోశ్‌రెడ్డి, గణపురం వెంకటేశం, నాని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్ము రవి

విజయోత్సవ సభలు ఎందుకు?

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయోత్సవ సభలను ప్రభుత్వం ఎందుకు నిర్వహిస్తుందో చెప్పాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అబద్ధపు, అసత్యపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల విషయంలో ఎన్నికలకు ముందు పత్రికా ప్రకటనలు ఇచ్చిన సర్కారు ఆ ప్రకటనల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

టీబీ నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

- టీబీ అలర్ట్ ఇండియా ఇంపాక్ట్ ప్రోగ్రాం జిల్లా అధికారి



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్

మద్దూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలని టీబీ అలర్ట్ ఇండియా ఇంపాక్ట్ జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ సూచించారు. మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం లద్నూరు, మద్దూరు పీహెచ్‌సీల సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గ్రామాల్లో టీబీ వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో స్పూటం(తెమడ) పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగిన వెంటనే పూర్తి చికిత్సకు వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రజిత, హెచ్‌ఈవో భువనేశ్వర్‌రెడ్డితో పాటు పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ జేఏసీ సంకల్పదీక్ష

- సీపీఎం జిల్లా నాయకుడు కొంగరి వెంకట్‌మావో

చేర్యాల, నవంబరు 28: చేర్యాల ప్రాంత ప్రజలను మభ్యపెట్టడానికే కాంగ్రెస్ జేఏసీ నేతలు సంకల్పదీక్ష చేపడుతున్నారని, రెవెన్యూ డివిజన్‌పై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గాంధీభవన్‌లో లేదా సచివాలయం వద్ద దీక్ష చేపడితే ప్రజలు విశ్వసిస్తారని సీపీఎం జిల్లా నాయకుడు కొంగరి వెంకట్‌మావో అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రజల ఆశలను వమ్ముచేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలతో ఏర్పాటుకావాల్సిన జేఏసీని అధికార పార్టీ నాయకులే ఏర్పాటుచేసుకోవడం అర్థరహితమన్నారు. సమావేశంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, బండకింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్, షఫీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

'మత్తుపదార్థాల నిర్మూలనకు కృషిచేయాలి'

మిరుదొడ్డి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి, మిరుదొడ్డి సీఐ గాయత్రి అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై మిరుదొడ్డి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దన్నారు. మత్తుకు బానిక కావడం వల్ల కుటుంబాలు రోడ్డునపడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఎక్సైజ్ ఎస్ఐ సరితా, ఎస్ఐ పరుశురాములు, ప్రిన్సిపాల్ అర్చన, ప్రియదర్శిని, సిబ్బంది రవి, కృష్ణగౌడ్, షాబుద్దీన్, ముజీబ్ తదితరులున్నారు.

ఎస్జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం



ఖలీద్

కుకునూరుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో కుకునూరుపల్లి విద్యార్థి బంగారు పతకం సాధించాడు. కొండపాక మండల కేంద్రంలో జరుగుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో కుకునూరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఖలీద్ బంగారు పతకం సాధించాడు. ఖలీల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, పీఈటీ రాజ్‌కుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు రామ్‌చరణ్



రామ్‌చరణ్

రాయపోల్/గజ్వేల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రామ్‌చరణ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థి రామ్‌చరణ్‌ను ఉపాధ్యాయ బృందంతో కలసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. ఈ నెల 23 నుంచి 25వరకు మహబూబాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్-17 పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఆయనవెంట పీడీ పావని, ఉపాధ్యాయులు ఉన్నారు.

'ఎస్సీ, ఎస్టీ, బీసీల సమస్యలు పరిష్కరించాలి'

హుస్నాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 90 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల సమస్యలు పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల సమస్యలు పరిష్కరించిలని బుధవారం హుస్నాబాద్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

గ్రంథాలయాలు నిశ్శబ్ద ఆలయాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు నిశ్శబ్ద ఆలయాలని, సమాజ శ్రేయస్సుకు అవి ఉపయోగపడుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాల్లో అన్ని వసతులు కల్పించి పాఠకులకు అందుబాటులోకి తెస్తామన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధీర్, అడ్వకేట్ చిత్తారి రవీందర్, కవులు చొప్పదండి సుధాకర్, ఉండ్రాళ్ల రాజేశం, గ్రంథపాలకులు డి. రాజు, కె. రాజు, కనకలక్ష్మి, ముజాఫర్, ఉమాపతి, సాయి. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

- వర్గల్: వర్గల్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే మహిళా డిగ్రీ కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కళాశాలలో 22000 పుస్తకాలు, 14 రకాల మ్యాగజైన్స్, 10 రకాల దినపత్రికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం భాస్కర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవందరావు. లైబ్రేరియన్ బాలలక్ష్మి, ఇన్‌చార్జి ప్రతిభాబిశ్వాస్, కమిటీ సభ్యులు జానకి, రజిత, ఏటీపీ ఉమామహేశ్వరితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దిపేట కల్చరల్: విజేతలతో కేడం లింగమూర్తి

- గజ్వేల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, మహేందర్, అలివేలు, రాంచంద్రం విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య తదితరులున్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి: రాములు

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అనుసరిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ, కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ, పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్ఎస్‌పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాములు, ఏఐపీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌లు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం చలో ఢిల్లీ కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, అనంతరం వారు మాట్లాడారు. కేంద్రం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని, బడా పెట్టుబడిదారులను ప్రోత్సహించడంలో తలమునకలవుతుందని విమర్శించారు.

ధరణి ఒక మోసాల పుట్ట

- రాష్ట్ర రైతు కూలీ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ స్వామి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వామి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధరణి ఒక మోసాల పుట్టగా తయారై రైతులను నరకయాతనకు గురి చేస్తున్నదని రాష్ట్ర రైతు కూలీ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ స్వామి ఆరోపించారు. రెవెన్యూ చట్ట సవరణలు, భూసంస్కరణలు జరపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో డిసెంబరు 9న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో పోరాట సమితి నాయకులు బుధవారం ఆవిష్కరించారు. సమావేశంలో టీయూఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాములు, రైతు కూలీ సంఘం నాయకులు ఎల్లం, మల్లేశం, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి చెకుముకి పోటీలు

జగదేవ్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నేడు జగదేవ్‌పూర్‌లో నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు చేర్యాల రామచంద్రం తెలిపారు. జగదేవ్‌పూర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించే పరీక్షకు పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎనిమిదో తరగతి, తొమ్మిదో తరగతి, పదో తరగతికి చెందిన ఒక్కొక్క మీడియంలో ఒక్కొక్క విద్యార్థి చొప్పున ముగ్గురిని మాత్రమే పరీక్షకు తీసుకురావాలని సూచించారు.

- సిద్దిపేట కల్చరల్: చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షులు కె. మహేందర్, అజీజ్, నర్సింగ్‌రావు, సుధాకర్ కోరారు. నేడు పట్టణంలోని ఎన్‌జీవోస్ భవన్‌లో ఉదయం 10 గంటలకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

పంచాయతీరాజ్ డైరెక్టర్‌ను కలిసిన కార్యదర్శులు

జగదేవ్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజనను కోరారు. బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన వారు కార్యదర్శుల సమస్యలపై డైరెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కార్యదర్శులు శశిధర్‌గౌడ్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు'

మర్కుక్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి అన్నారు. మర్కుక్‌లో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని సూచించారు.

మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకోవాలి

బస్వాపూర్ రైతులు

కోహెడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సారవంతమైన, విలువైన భూములను కాలువల నిర్మాణంలో కోల్పోతున్నామని, ప్రభుత్వం చెల్లించే పరిహారం కాకుండా మార్కెట్‌లో భూముల వాస్తవ ధరలను పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బస్వాపూర్‌లో బుధవారం హుస్నాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మూర్తి ఆధ్వర్యంలో రంగనాయక్‌సాగర్ ప్రాజెక్టు ఎల్‌డీ 6 కాలువల నిర్మాణ భూసేకరణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రైతులు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో భూముల వాస్తవ ధరలకు ప్రభుత్వం చెల్లించే పరిహారానికి ఏమాత్రం పొంతన లేదన్నారు. ఎకరానికి రూ. 30 నుంచి రూ. 40 లక్షలపైనే భూములకు రేటు ఉందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు కనీసం రూ. 20 నుంచి రూ. 30 లక్షల వరకు పరిహారం చెల్లిస్తేనే ఈ విలువైన భూములు ఇస్తామన్నారు. అరకొర పరిహారం అందించి భూములు గుంజుకుంటే ఊరుకునేది లేదన్నారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ.. గ్రామసభలో రైతులు చేసిన సూచనలు, సలహాలు ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ మనుచౌదరి, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి రైతులు కోరుకుంటున్న పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, ఇన్‌చార్జి తహసీల్దార్ దేవేంద్ర, ఎంపీడీవో కిష్టయ్య, భూసేకరణ డీటీ అరవింద్, ఆర్ఐ సురేందర్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

కులగణన సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

- బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు

గజ్వేల్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక కులగణన సర్వేను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు సూచించారు. గజ్వేల్ మండలం బెజుగామలో జరుగుతున్న సర్వేను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన సర్వేకు తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ, భూమి, ఉపాధి, విద్య రిజిస్ట్రేషన్లల్లో లబ్ధి పొందిన వివరాలు తెలపాలని అన్నారు. కార్యక్రమంలో సర్వేదారులు శంకరయ్య, గ్రామస్థులు సురేందర్, పెంటయ్య, వెంకటమ్మ తదితరులున్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- డిసెంబరు 4, 5న సిద్దిపేటలో టీజీ యూఈఈయూ సభలు

వర్గల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో జనవరి 4, 5వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీజీ యూఈఈయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గౌరారంలో బుధవారం మర్కుక్, గౌరారం సెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలకు కార్మికులు భారీగా తరలిరావాలన్నారు.

- దౌల్తాబాద్: జనవరి 4, 5 తేదీల్లో నిర్వహించే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటిపల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ముబ్బారాస్‌పూర్ సబ్‌స్టేషన్‌లో దౌల్తాబాద్, రాయపోల్ ఉమ్మడి మండల సెక్షన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ సహాయకార్యదర్శి రామగౌని రవికుమార్‌గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ యాదగిరియాదవ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దూలం యాదగిరిగౌడ్, నాయకులు శ్రీమాన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



వర్గల్: సమావేశంలో నాయకులు

బ్యాంకు చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

కుకునూరుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు చుట్టూ సీసీ కెమెరాలు, బ్యాంకు ముందు భాగంలో వెలుతురు ఉండేలా లైట్ల ఏర్పాటు చేసుకోవాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఏపీజీవీబీ, డీసీసీబీ బ్యాంకులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయనవెంట తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

- గజ్వేల్: బ్యాంకుల్లో అధికారులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా బ్యాంకులను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం ఓ చోట ఎస్‌బీఐ బ్యాంకులో జరిగిన దోపిడీ గురించి వివరిస్తూ బ్యాంకుల్లో చేపట్టవలసిన జాగ్రత్తలను వివరించారు. బ్యాంకుల్లో సీసీ కెమెరాలు మానిటరింగ్ చేసుకుంటూ ఉండాలని, తప్పనిసరిగా గార్డును నియమించుకోవాలని, లాకర్స్ సెఫ్టీ, బ్యాంకు వచ్చే ప్రజలకు లావాదేవీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏ వ్యక్తి అయినా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకువస్తే వారిని జాగ్రత్తగా ఉండేలా సూచనలు చేయాలన్నారు.



కుకునూరుపల్లి డీసీసీబీలో లాకర్లను పరిశీలిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

మహిళలకు అండగా అభయ

5వ పేజీ తరువాయి



ఆటోకు అభయ యాప్ స్టిక్కర్‌ను అంటిస్తున్న సీపీ అనురాధ

తగు రక్షణ చర్యలు తీసుకుంటారు. మహిళలు, ప్యాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవాలి ఆటో డ్రైవర్ వివరాలు నంబర్ వస్తుంది. ఆటోలో ఏదైనా విలువైన వస్తువులు మర్చిపోతే వెంటనే ఆటోను ట్రేస్ అవుట్ చేయడానికి కూడా వీలుంటుంది. గతంలో ఆటోడ్రైవర్ ఏదైనా కేసులో ఇన్వాల్వ్ అయి ఉంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే "ధిస్ ఆటో నాట్ సేఫ్" అనే రెడ్ సిగ్నల్ వస్తుంది. అలాగే డ్రైవర్లు అసభ్యంగా ప్రవర్తించినా, ర్యాష్‌డ్రైవింగ్ చేసినా, హిట్ అండ్ రన్ చేసినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

అభయ యాప్‌తో ఆటో డ్రైవర్లకు సేఫ్

ఆటో చోరీకి గురైనపుడు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి, ఆటో వెనుక ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయగానే లైవ్ లోకేషన్ తెలుస్తుంది. అభయ యాప్ రూ.50తో యాక్సిడెంట్ డెత్‌కు రూ.లక్ష రూపాయల ఇన్సూరెన్స్ డ్రైవర్‌కు వర్తిస్తుంది.

ప్రతీ ఆటోకు యాప్ స్టిక్కర్ అంటించాలి

జిల్లాలో ఉన్న ఆటోడ్రైవర్లు తమ ఆటోల వెనుక తప్పకుండా అభయ యాప్ స్టిక్కర్‌ను అంటించారు. ఇప్పటి వరకు 1250 మంది ఆటోడ్రైవర్లకు ఈ స్టిక్కర్లు అందించాము. మిగిలిన ఆటోలకు కూడా త్వరలోనే అందిస్తాం. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసు వారికి సహకరించాలి. ఈ అభయ యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.

- అనురాధ, సీపీ